@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శుక్రవారం, 10 నవంబర్ 2023 | పేజీలు: 04




# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..

- టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి
- నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రెడ్డి
- నామినేషన్‌కు వేలాదిగా తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- దేవాలయం నుంచి సభాస్థలి వరకు కాంగ్రెస్ భారీ ర్యాలీ..
- అనంతరం భారీ బహిరంగ సభ..
- వీరనారి చాకలి ఐలమ్మను తలపించిన యశస్విని రెడ్డి..

పాలకుర్తి, (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబర్ 09:

మండలం కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో ఆ పార్టీ అభ్యర్థి యశస్వినిరెడ్డి రాణి రుద్రమలా గర్జించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. అంతకు ముందు ఝాన్సీ యశస్వినిరెడ్డి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం బతుకమ్మ, బోనాలు, డప్పు చప్పుళ్ల నడుమ టెంపుల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కాంగ్రెస్ భారీ ర్యాలీ చేపట్టింది. నామినేషన్ మిగతా 2లో..





# కామారెడ్డిని బంగారు తునక చేస్తా

- కేసీఆర్ వస్తే ఒక్కడే రాడు..అనేకం వస్తాయ్
- నేనం చేస్తానో రేపురేపు మీరే చూస్తారు..
- 50 లక్షలతో పట్టుబడ్డోడు..నాపై పోటీ చేస్తాడట
- ధరణిని వద్దనోటళ్లను..కరెంట్ తీసేటోళ్లను ఓడించాలి
- అలాంటోడు కావలో..నేను కావాలో తేల్చుకోవాలి
- తెలంగాణను ఆగం చేసేందుకు వచ్చే వాళ్లతో జాగ్రత్త
- కామారెడ్డిలో నామినేషన్ వేసిన కెసిఆర్
- ప్రజాశీర్వాద సభలో కాంగ్రెస్, బీజేపీలను ఏకిపారేసిన కెసిఆర్

(నేటి ఫోకస్‌న్యూస్), కామారెడ్డి-నవంబర్9:

కామారెడ్డితో తనకు గట్టి అనుబంధం ఉందని..అందుకే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని సిఎం కెసిఆర్ అన్నారు. 50లక్షలతో పట్టుబడ్డ వాడే నాతో పోటీ కొస్తాడట.. ఇక వాని సంగతి మీరే చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రంలోని బీజేపీ సర్కారుపైన సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. బీజేపీ, ప్రధాని మోదీ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి కూడా బరిలో దిగుతున్న సీఎం కేసీఆర్.. కామారెడ్డిలో నామినేషన్ వేసిన అనంతరం అక్కడ జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించారు. వచ్చిన తెలంగాణను వచ్చిన్నం చేయడానికి టీఆర్ఎస్ పార్టీని అస్థిరం చేయడానికి వచ్చి ఎవడైతే 50 మిగతా 2లో..



## అభివృద్ధిలో ఆదర్శంగా తెలంగాణ

- కొడంగల్ పేరును బద్నాం చేసిన రేవంత్
- డబ్బులతో ప్రజలను రేవంత్ కొనలేడు
- కొడంగల్ ప్రచారంలో కేటీఆర్ విమర్శలు

నేటి ఫోకస్ న్యూస్, కొడంగల్-నవంబర్9:

అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. కొడంగల్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, కరెంట్ పోయిందని విమర్శించారు. కర్ణాటక రైతులు కొడంగల్ వచ్చి ధర్నాలు చేస్తున్నారని, మిగతా 2లో..

## ఎన్నికల వేళ ఐటీ దాడుల కలకలం

- పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు
- కుటుంబ సభ్యులను కలుసుకోనివ్వకుండా విచారణ
- ఓ అభిమాని ఆత్మహత్యా యత్నం..అడ్డుకున్న పోలీసులు
- కేసీఆర్ కుట్రేనని ఆరోపించిన పొంగులేటి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/ఖమ్మం-నవంబర్9:

తెలంగాణ ఎన్నికల వేళ ఐటి దాడులు మరోమారు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి ఇంటిపై దాడులపై విమర్శలు వస్తున్నాయి. పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఐటీ దాడులు కొనసాగాయి. ఉదయం 5 గంటల నుంచి ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల సిబ్బం దిని విడివిడిగా ఉంచి ఐటీ అధికారులు విచారించారు. ఉదయం నుంచి కుటుంబ సభ్యులను ఐటీ అధికారులు కలుసుకోనివ్వలేదు. పొంగులేటి ఇంటికి మరో ఐటీ బృందం వచ్చి సోదాలు చేస్తోంది. దీంతో పొంగులేటి ఇంటి ముందు ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన కొనసాగించారు. పోంగులేటి మిగతా 2లో..



## దేశమంతా గులాబీ హవా..


అప్పుడే విజయోత్సవ సభల్లా ఉంది

షకీల్ నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత

నేటి ఫోకస్ న్యూస్, బోధన్-నవంబర్9:

దేశమంతా గులాబీ హవా నడుస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ సందర్భంగా బోధన్ పట్టణంలో తీసిన ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. షకీల్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం మిగతా 2లో..





## ఆర్మూర్ ప్రచారంలో అపశృతి

- ప్రచార రథంపై నుంచి కిందపడ్డ కేటీఆర్..

నేటి ఫోకస్ న్యూస్, ఆర్మూర్-నవంబర్9:

ఆర్మూరు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రచార రథం రెయిలింగ్ విరగడంతో మంత్రి కేటీఆర్ ప్రచారం రథంపై నుంచి కిందపడ్డారు. మంత్రి కేటీఆర్‌తోపాటు ఎంపీ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మిగతా 2లో..

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెలను.
ఆసక్తి ఉన్నవారు
ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596
FOCUS TV TELUGU



## ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ (నేటి ఫోకస్ న్యూస్)నవంబర్ 09:

ఎన్నికల నిర్వహణ లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు బాబు రాయ అధికారులను ఆదేశించారు. ఐడిఓసిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ పనితీరును జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంకతో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల వ్యయ పరిశీలకులు నిర్వహిస్తున్న ఎన్నికల విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక వివరిస్తూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సి విజిల్ యాప్ 1950 కాల్ సెంటర్ మీడియా మోనిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ సువిధ యాప్ పర్మిషన్స్ స్టాటిస్టికల్ సర్వే టీమ్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ పనితీరును తెలియజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా యంత్రాంగం పోలీసు యంత్రాంగంతో సమన్వయంతో పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు బాబు రాయ కాల్ సెంటర్ నిర్వహణతీరును జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ తో సందర్శించి పరిశీలించారు. అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వ్యయ పరిశీలకులు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్ జిల్లా నోడల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 13 నామినేషన్లు దాఖలు

- గురువారం నాటికి 21 నామినేషన్లు దాఖలు పూర్తి అయినట్లు రిటర్నింగ్ అధికారి గోపి రామ్ వెల్లడి
- నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం

ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రతినిధి (నేటి పోకస్ న్యూస్) -చారకొండ వెంకటేష్, నవంబర్ 9:



అచ్చంపేట నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్, డిఎస్పి, ఇండిపెండెంట్ పార్టీ నేతలు వచ్చి ఒక్కొక్క పార్టీ అభ్యర్థి తరఫునుండి రెండు మూడు నామినేషన్లు వేయడం జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపి రామ్ తెలిపారు. గురువారం ఒకరోజు 13 నామినేషన్ల దాఖలు వచ్చాయని ఎన్నికల అధికారి తెలిపారు. గురువారం నాటికి మొత్తం 21 నామినేషన్లు దాకాలు పూర్తి అయినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. నేడు శుక్రవారంతో నామినేషన్ల పర్వం ముగియనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. చివరి రోజు నామినేషన్ల పర్వం ఉన్నందున అభ్యర్థులు ఎక్కువగా హాజరయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల నామినేషన్లను దృష్టిలో పెట్టుకొని నామినేషన్ల సెంటర్ దగ్గర ప్రత్యేక పోలీసు బందోబస్తు, స్పెషల్ పార్టీ పోలీస్ బృందాలు, సిసి కెమెరా నిఘా తో పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం

- మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి



అమ్రాబాద్ (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబర్ 9

అచ్చంపేట పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గువ్వల బాలరాజు నేడు (శుక్రవారం )నామినేషన్ వేస్తున్న సందర్భంగా అమ్రాబాద్ మండలంలోని ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని ఈ యొక్క బైక్ ర్యాలీ విజయవంతం చేయవలసిందిగా బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి తెలిపారు.

## దేశమంతా గులాబీ హవా..

(మొదటి పేజీ తరువాయి..)

దేశమంతటా గులాబీ హవా నడుస్తున్నదని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీదే విజయమని అన్నారు. షకీల్ నామినేషన్ ర్యాలీని చూస్తుంటే విజయోత్సవ ర్యాలీలా అనిపిస్తున్నదని ఆమె అభివర్ణించారు. ఈ జోష్ షకీల్ విజయం ఖాయమని చెబుతోందని అన్నారు. కరెంట్, దరణి వద్దన్నోళ్లను కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. బిఆర్ఎస్‌ను గెలిపించడం ద్వారా కాంగ్రెస్, బిజెపిలకు బుద్ధి చెప్పాలన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీకి ఈ ఎన్నికల్లో రైతన్నలు మద్దతు ఇవ్వకూడదు. రైతన్నలకు రైతుబంధు మాత్రమే ఆపలా?? ఎన్నికల కోడ్ చెప్పి సంక్షేమ పథకాలను ఆపేందుకు రాహుల్‌గాంధీ కుయుక్తులు పన్నుతున్నారు. నాలుగు ఓట్ల కోసం

ప్రజల కడుపు కొట్టె నీచమైన దుర్మార్గానికి కాంగ్రెస్ తెరలేపింది. బీఆర్ఎస్ పార్టీ రాజకీయ సుస్థిరత సాధించింది .. రాజకీయ సుస్థిరత లోపిస్తే మన అవకాశాలు ఎత్తుకుపోయే ప్రమాదం ఉంది. బెంగుళూర్‌ని ఐటీలో క్రాస్ చేశాం .. ఐటీ హబ్‌లు వచ్చాయి .. ఇండస్ట్రియల్ జోన్స్ కూడా వస్తాయి. తెలంగాణను కేసీఆర్ ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చూస్తే ఆ పార్టీ నేతల్లో అభద్రతా భావం కనిపిస్తుంది. ఆఫీసర్లను మార్చాలని, రైతుబంధు, దళిత బంధు ఆపాలని కాంగ్రెస్ అంటుంది. ఆలా అయితే కాంగ్రెస్ వాళ్ల ఇళ్లకు కరెంట్ ఆపాలి. తెలంగాణ వచ్చిన తర్వాతనే కరెంట్ వచ్చింది కదా. బీజేపీ లాగా పేర్లు మార్చి కేసీఆర్ ప్రభుత్వం పథకాలు పెట్టడం లేదు. యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్ అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇచ్చింది. కాని దానిని ఆచరణలో పెట్టలేదు. కాంగ్రెస్ పాలిత రాష్టాల్లో ఎందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం లేదు. 2010లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీలను చేర్చకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసింది.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి





(మొదటి పేజీ తరువాయి..)

వేసిన అనంతరం అక్కడి నుంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఝాన్సీ యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావుపై విమర్శలు గుప్పించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిందేమీలేదని అన్నారు.

**ఐలమ్మ వారసురాలిగా యశస్విని వచ్చింది..**

ఆనాడు దొరలకు వ్యతిరేకంగా వీరనారి చాకలి ఐలమ్మ ఈ పాలకుర్తి గడ్డమీది నుంచే పోరాటం చేసిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇవాళ ఆ దొరల వారసుడైన ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించడానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఝాన్సమ్మ కోడలు యశస్వినిరెడ్డి పాలకుర్తి ఎన్నికల బరిలో నిలిచిందని అన్నారు. పాలకుర్తి కాంగ్రెస్ సభకు వేలాదిగా తరలి వచ్చిన ప్రజలను చూస్తే ఎర్రబెల్లి గఢీ గోడలు బద్దలు కావడం ఖాయమనే నమ్మకం తనకు కలుగుతోందని అన్నారు. 2018లో ఎర్రబెల్లిని ఓడించాలనుకున్న తన గురి తప్పిందని కానీ ఈ ఎన్నికల్లో దయాకర్ రావును ఇంటికి పంపడం పక్కా అని విశ్వాసం వ్యక్తం చేశారు.

**అవినీతి, అక్రమాలకు కేరాఫ్ ఎర్రబెల్లి..**

రేషన్ డీలర్ గా రాజకీయ జీవితం ప్రారంభించిన దయాకర్ రావు.. నేడు అక్రమాలు, అవినీతికి పాల్పడి వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని ఆరోపించారు. గత ఐదేళ్లుగా మంత్రిగా పని చేస్తున్న ఎర్రబెల్లి.. నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇండ్లు, నిరుద్యోగులకు ఉపాధి, విద్యార్థులు, రైతన్నలను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఫైర్ అయ్యారు. 15 ఏళ్లు ప్రజలు అధికారం ఇస్తే ఏం చేయని ఎర్రబెల్లి దయాకర్ రావు.. ఈ ఎన్నికల్లో లేనిపోని హామీలిస్తూ గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి అంటూ డ్రామాలాడుతున్నారని ఎర్రబెల్లిపై విరుచుకుపడ్డారు. ఇన్నేళ్లు అధికారంలో ఉండి తన హామీలను నెరవేర్చని వ్యక్తి ఈసారి అధికారం ఇస్తే చేస్తాడా అని ప్రశ్నించారు. మోసపూరిత హామీల అంటూ ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్న దయాకర్ రావుని పాలకుర్తి నియోజకవర్గం నుండి తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు.

**ఎర్రబెల్లి దందాలు చేస్తే.. ఝాన్సమ్మ దానాలు చేసింది..**

దందాలు, దోపిడీలు చేసిన చరిత్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కానీ ప్రజలకు నిజాయితీగా సేవ చేయడానికి వచ్చిన గొప్ప చరిత్ర హనుమాండ్ల ఝాన్సీరెడ్డిదని ఆయన అన్నారు. అమెరికాలో స్థిరపడ్డ ఝాన్సీరెడ్డి కుటుంబం ఇక్కడి ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ఈ క్రమంలోనే పాలకుర్తి నియోజకవర్గంలో 80 ఎకరాల భూమి కొని పేద ప్రజలకు తాము చేస్తున్న సేవలను మరింత విస్తృత పరచాలని ఝాన్సమ్మ భావించారన్నారు. అయితే ఆ భూమి పక్కనే తన అక్రమ సొమ్ముతో ఎర్రబెల్లి 150 ఎకరాలు కొని ఝాన్సీరెడ్డి సేవా కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. ఈ క్రమంలోనే పాలకుర్తి ప్రజలకు మరింత సేవ చేయడానికి ఝాన్సీరెడ్డి ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తే ఆమెకు పౌరసత్వం రాకుండా మంత్రి ఎర్రబెల్లి తన దళారులతో అడ్డుకున్నారని అన్నారు. దీంతో ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయడానికి ఝాన్సీరెడ్డి తన కోడలు యశస్వినిరెడ్డిని ఎర్రబెల్లిపై పోటీకి దింపిందని వివరించారు. డబ్బు సంపాదించుకోవాలనే ఆశ ఝాన్సీరెడ్డి కుటుంబానికి లేదన్న రేవంత్.. యశస్వినిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి ఝాన్సమ్మకు గిఫ్ట్ గా అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ఓటు వేసేముందు ఒక్కసారి ఆలోచించాలి..**

ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని కాంగ్రెస్ అభ్యర్థి ఝాన్సీ యశస్వినిరెడ్డి ప్రజలను కోరారు. రాష్ట్రంలో రెండు దఫాలు బీఆర్ఎస్ కు అధికారం కట్టబెడితే రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, బీసీ, మైనారిటీలు ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం అప్పుల కుప్పగా మార్చిందని మండిపడ్డారు. పాలకుర్తిలో వరుసగా మూడు సార్లు ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రజలు పట్టం కట్టారని, కానీ దయాకర్ రావు ఇక్కడి ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆరోపించారు. ఈసారికి తెలంగాణ రాష్టాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కర్ణాటకలో లాగా ఆరు గ్యారెంటీలతో పాటు అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని తనను గెలిపిస్తే చేసి చూపిస్తానని ఆమె అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రభుత్వ నిధులతో పాటు తన జీతాన్ని కూడా నియోజకవర్గ అభివృద్ధికి వినియోగిస్తానని అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో దగాకోరు దయాకర్ రావును తరిమి కొట్టేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ 20 రోజులు కష్టపడితే రాష్ట్రంలో, పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని ఆమె అన్నారు. ఇక అంతకు ముందు మాట్లాడిన ఝాన్సీరెడ్డి తన కోడలు యశస్వినిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, కాకిరాల హరిప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, తొర్రూర్, కొడకండ్ల, పెద్ద వంగర, దేవరుప్పుల, రాయపర్తి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు.

# కామారెడ్డిని బంగారు తునక చేస్తా

(మొదటి పేజీ తరువాయి..)

లక్షల నగదుతో దొరికిండో.. ఆయన్నే తీసుకొచ్చి ఇవాళ కేసీఆర్ మీద పోటికి పెడతరంట. దీనిమీద కామారెడ్డి ప్రజలు తీర్పు చెప్పాలి. ఆ బాధ్యత మీ మీద ఉంది.' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఆలోచించి.. విచక్షణ చేసి ఎవరి ప్రవర్తన ఏంటనేది చూసి ఓటేయాలని సూచించారు. కేసీఆర్‌తో పాటు కామారెడ్డికి కూడా పరిశ్రమలు, ఐటీ రంగం కూడా వస్తాయన్నారు. కేసీఆర్ ఒక్కడు రాడు.. కేసీఆర్ వెంబడి చాలా వస్తాయని చెప్పారు. ఇప్పుడు చెబితే నరికినట్టు అయితది.. రేపు అందరికి కనబడ్తదని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గాన్ని బంగారు తునకలా తయారు చేసి మీకు అప్పగిస్తా అని హామీ ఇచ్చారు. తాను కామారెడ్డి నుంచి పోటీ చేస్తే ఈ నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. ఏడాదిన్నర, రెండేళ్లలో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చి చూపిస్తానని, ఇది నా వాగ్దానమని సీఎం శపథం చేశారు. కాబట్టి ప్రజలు ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగతదో బాగా ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు. 'కేసీఆర్ వెంట చాలా వస్తయ్. విద్యుత్ సంస్థలు వస్తయ్. ఎడ్యుకేషన్ సంస్థలు వస్తయ్. పరిశ్రమలు వస్తయ్. మీరు ఊహించని అభివృద్ధి జరుగుతది. కామారెడ్డి పట్టణంతోపాటు ఇక్కడి పల్లెల రూపురేఖలు కూడా మారుతయ్. చాలా అద్భుతమైన నియోజకవర్గంగా కామారెడ్డిని తయారు చేసే బాధ్యత నాది. అందుకు మీ సహకారం కావాలి. మీరు ఒకటి రెండు సార్లు బాగా ఆలోచించి ఓటేయాలి. ఎవరికి ఓటేస్తే నియోజకవర్గానికి, రాష్ట్రానికి మేలు జరుగుతదో బేరిజు వేసుకోవాలి. అంతేతప్ప ఆగమాగమై ఓటు వేయొద్దని సీఎం సూచించారు. రైతుబంధు వద్దు.. 24 గంటల కరెంటు వద్దు.. ధరణిని తీసేసి అక్కడ పడేస్తాం అని అనేటోళ్లు కావాల్నా.. ప్రజల్ని కడుపులో పెట్టుకుని చూసేటోళ్లు కావాల్నా నిర్ణయించుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణపై కక్షగట్టి ఒక్క నవోదయ పాఠశాలనుగానీ, ఒక్క మెడికల్ కాలేజీనిగానీ ఇయ్యలేదని, మోటార్లకు మీటర్ల పెట్టేందుకు ఒప్పుకోలేదని రూ.25 వేల కోట్ల నిధులకు కోత పెట్టిందని కెసిఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ నాయకులేమో మోటార్లకు మీటర్లు పెట్టాలని అంటుంటే..

కాంగ్రెస్ నాయకులేమో కరెంటు వద్దు రైతుబంధు వద్దు అంటున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. రైతులపై కాంగ్రెస్ వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీకి ఎవుసం.. ఎద్దు ఏమైనా తెలుసా.. నాగలి పట్టిండా.. అని ప్రశ్నించారు. నేను కాపోణ్ని, ఇప్పుడు కూడా వ్యవసాయం చేస్తా కాబట్టి రైతు బాధ తెలుసని అన్నారు. ధరణి రాకముందు రైతులకు ఎంతమంది భర్తలు ఉండేటోళ్లు. వీఆర్వో ఒక భర్త. గిరిదవారీ ఒక భర్త. తాసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఆయనమీద రెవెన్యూ సెక్రటరీ.. సీసీఎల్ఏ, రెవెన్యూ మంత్రి ఉండేటోళ్లు. ఇండ్ల ఎవరికి కోపం వచ్చినా.. కైలాసం ఆటల పెద్దపాము మింగినట్టే. భూమికి గోవిందా. ఎల్లయ్య భూమి పుల్లయ్యకు రాసి, పుల్లయ్యది మల్లయ్యకు రాసి.. జుట్లు ముడేసి.. వాళ్లకు తాకట్లు పెట్టి. ఆఫీసుల చుట్టు తింపి. వేలు, లక్షలు గుంజిండ్రు. వాళ్లను నాశనం పట్టిచ్చిండ్రు.' అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ధరణి పోర్టల్ తెచ్చినమని స్పష్టం చేశారు. ధరణి ద్వారా భూ యాజమాన్యం మార్చేందుకు తన దగ్గర ఉన్న అధికారాన్ని ప్రభుత్వం.. రైతులకే అప్పగించిందని వివరించారు. మీరు బొటనవేలు పెడితేనే భూ యాజమాన్యం మారుతుంది తప్ప.. దాన్ని మార్చే పవర్ రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా లేదని స్పష్టం చేశారు. అలాంటి ధరణిని తీసేస్తే రైతుబంధు ఎట్ల వస్తది రైతుబీమా ఎట్ల వస్తది వడ్లు కొన్న పైసలు ఎట్ల వస్తయని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ధరణి తీసేస్తే పాత గిరిద్వారీలు.. వీఆర్వోలు వస్తరు. అప్పుడు మల్ల ఆఫీసుల చుట్టుతిరిగే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామని అనేటోళ్లను బంగాళాఖాతంలో వేయాలని ప్రజలకు సూచించారు. ఓటేసే ముందు పార్టీల ఫిలాసఫీ ఏంటి వాళ్ల ఆలోచన సరళి ఏంటనేది ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమం అప్పుడు గిట్లనే నన్ను అగ్రతిప్పలు పెట్టిండ్రు.. కాలికి పెడితే మెడకు.. మెడకు పెడితే కాలికి. ఎడ్డం అంటే తెడ్డం అని.. అవునంటే కాదని.. ఎన్ని రకాల గోసలు పెట్టాలో అన్ని పెట్టిండ్రు. చివరకు నాకు తిక్కరేగి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనా తెలంగాణ జైత్రయాత్రనా అని బయల్దేరితే.. ఎక్కడికక్కడ మీరు నరసింహులై లేస్తే.. ఊర్లన్ని ఉద్యమాలైతే.. సకల జనుల సమ్మె జరిగితే అప్పుడు దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేసిండ్రని అన్నారు. వెంటనే ఇచ్చిండ్రా అంటే మల్ల ఏడాదిన్నర ఎగవెట్టిండ్రు. సకల జనుల సమ్మె అని యావన్మంది ఉద్యోగులు, ప్రజలు, రైతులు మొత్తం రోడ్ల మీదకు వచ్చి కొట్లాడితే.. చివరకు తెలంగాణల నూకలు పుట్టకుండా అయితయని అప్పుడు ఇచ్చారని, ఇది కాంగ్రెస్ పరిస్థితి అని వివరించారు. ఎవడైతే కొనడానికి వచ్చి 50 లక్షల నగదుతో పట్టుబడ్డడో.. ఇప్పుడు ఆ మహాత్ముడే కామారెడ్డిల నామీద పోటికొస్తడంట. ఎవరికి ఏం బుద్ధి చెప్పాల్నో మీరే నిర్ణయం చేయాలని ప్రజలను కోరారు. నాడు తెలంగాణ వచ్చేనాటికి వలసలు పోవుడు.. బతుకపోవుడు.. చెట్టుకొకలు.. పుట్టకొకలు అయినం. ఆగమాగం అయినం. ఇయ్యాళ కాపాడుకోవాలి? నిలబెట్టుకోవాలని ఐదారు పనులు చేసినం. ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కాల్వలకు నీళ్లు ఇచ్చినం. మన దగ్గర నీళ్లకు ట్యాక్స్ లేదు. పాత బకాయిలు ఉంటే మాఫీ చేసినం. ఇయ్యాళ్ల కూడా ప్రాజెక్టుల ద్వారా చెరువుల కింద కానీ రఖం కట్టుడు లేదు. అదేవిధంగా కరెంటు 24 గంటలు ఫ్రీ ఇస్తున్నం. గతంలో రైతులను బాగా బాధపెట్టేది. ఇయ్యాళ ఎవడైనా కరెంటోడు వచ్చి.. రైతులను నిలదీసే పరిస్థితి లేదన్నారు. రైతుబంధు స్కీం పెట్టుకున్నం. ఎవరికైనా అపాయం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడొద్దని రైతుబీమా పెట్టుకున్నం. ధాన్యం మీ దగ్గర కొంటే ప్రభుత్వానికి డబ్బులు రావు. ఏటా 500, వెయ్యి కోట్ల నష్టం వస్తది. అయినా సరే అని చెప్పి.. మొత్తం ధాన్యం మీ ఊరికే వచ్చి కొంటున్నం. డబ్బులు కూడా వెంటనే వేస్తున్నం. యాసంగి పంట వరకు ధాన్యం డబ్బులు, రైతుబంధు వస్తున్నాయి. రెండు కలిసి పెట్టుబడికి

సరిపోతున్నాయి. అప్పులు తీసుకోవాల్సిన బాధ పోతుంది. ' అని సీఎం కేసీఆర్ అన్నారు. రైతాంగాన్ని నిలబెట్టుకోవాలి.. వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే పద్ధతితో ముందుకుపోతున్నమని అన్నారు. ఇలా పెన్షన్లు కావచ్చు.. అనేక సంక్షేమ కార్యక్రమాలు కావచ్చు. గొర్రెల పెంపకం కావచ్చు.. చేపల పిల్లలు కావచ్చు. ఏ వృత్తికి ఆ వృత్తి వాళ్లు పైకి రావాలని అందర్నీ ఆదుకున్నామన్నారు. 'తెలంగాణ రాకముందు మన గతి ఎట్లుండె. మన చెరువులు ఎట్లుండే. మన చెరువులు మొత్తం బోసిపోయి ఉండె. మిషన్ కాకతీయ ద్వారా చేసుకుంటే.. ఈరోజు బ్రహ్మాండంగా 33వేల కోట్ల రూపాయల చేపలను తెలంగాణ ఎగుమతి చేస్తుంది. ఇలా అన్ని వర్గాలు ప్రజలను కడుపుల పెట్టుకని పోతున్నాం.' అని తెలిపారు. పదేండ్ల నుంచి శాంతిభద్రతలు ఎట్లున్నయి? ఒక్కరోజు కర్ఫ్యూ లేదు. కల్లోలం లేదు. వానలు బాగపడి కరువు కూడా లేదని అన్నారు. ఓటు వేసే ముందు అభ్యర్థిని చూడాలి.. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీని చూడాలి.. ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచిదో అది కూడా చూడాలని ప్రజలకు సూచించారు. కలలో కూడా అనుకోని అనేక సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. కంటి వెలుగు అనే కార్యక్రమం ఎప్పుడైనా విన్నరా? చరిత్రల ఏ ప్రభుత్వమైనా చేసిందా? అని ప్రశ్నించారు కేసీఆర్ కిట్ పెట్టి బ్రహ్మాండంగా ప్రసవాలు అన్ని ప్రభుత్వ దవాఖానాల్ల జరుగుతున్నాయి. మాతా, శిశు మరణాలు తగ్గినయ్.' అని అన్నారు. వైద్య రంగం కావచ్చు.. విద్య రంగం కావచ్చు. వ్యవసాయ రంగం కావచ్చు.. పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు వస్తున్నాయి. ఐటీ రంగం పెరుగుతుంది. అని తెలిపారు.

# ఎన్నికల వేళ ఐటీ దాడుల కలకలం

(మొదటి పేజీ తరువాయి..)

తనపై ఐటీ, ఈడీ దాడులు జరుగుతాయని ముందే చెప్పారు. పొంగులేటి ఇంటి ముందు కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఉపేందర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. బాధిత ఉపేందర్ ముదిగొండ మండలం కట్టూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బాధితుడిని అడ్డుకుని అతనిపై నేతలు నీళ్లు పోసి కాపాడారు. పొంగులేటి ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంతలా ఓట్ల కోసం తిరుగుతున్నారో అంతకంటే ఎక్కువ ఐటీ అధికారులు నేతల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ నేత, పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసాలు, ఆఫీస్‌లపై ఐటీ రైడ్స్ జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితమే ఆయన ఈ విషయాన్ని చెప్పారు. తనపై కూడా ఐటీ రైడ్స్ జరుగుతాయని అందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని చెప్పుకొచ్చారు. ఆయన విమర్శలు చేసిన రెండు రోజుల్లోనే ఐటీ అధికారులు రైడ్స్ షురూ చేశారు. వేకువజామున నాలుగు గంటలకే దిగబడ్డ అధికారులు ఆయన నివాసం ఉండే ఇంటితోపాటు ఆయనకు సంబంధం ఉన్న వివిధ కంపెనీల్లో సోదాలు చేస్తున్నారు. ఖమ్మంతోపాటు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. 8 వాహనాల్లో అధికారులు వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. హైదరాబాద్‌లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉండే నివాసంతోపాటు ఆయన ఆఫీసుల్లో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ కూడా వేకువజాము నుంచే పక్రియ కొనసాగుతోంది. పొంగులేటి ఇవాళ నామినేషన్ వేయనున్నారు. ఇంతలో ఐటీ రైడ్స్ జరుగుతుండటంపై ఆయన వర్గీయులు ఆగ్రహంతో ఉన్నారు. నామినేషన్ ఏర్పాట్లు చేస్తున్న టైంలో రైడ్స్ ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇంట్లో వాళ్లందర్నీ హౌస్ అరెస్టు చేసిన అధికారులు వారిని ఎటూ కదలనీయడం లేదు. వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బయట వారితో మాట్లాడనీయడం లేదు. ఐటీ రైడ్స్ విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు భారీగా ఖమ్మం చేరుకుంటున్నారు. బయటవారిని ఎవర్నీ లోపలికి రానివ్వ లేదు. పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను వేధించేందుకే ఐటీ దాడులు చేయిస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇంత నీచానికి దిగజారుతారా అని, ఇంత దుర్మార్గం ఎక్కడ చూడలేదని మండిపడ్డారు. న్యాయం గెలుస్తుందని, తెలంగాణ ప్రజలు గమనించాలని, తన వెంట ప్రజలు ఉన్నారని పొంగులేటి స్పష్టం చేశారు. 'నా ఇళ్లలో ఐటీ అధికారులు బీభత్సం సృష్టిస్తున్నారు. కొండను తవ్వి ఎలుకలను కూడా పట్టుకోలేదు. ఒక్క లక్ష కూడా పట్టుకోలేదు. నా కుటుంబ సభ్యులను హౌస్ అరెస్ట్ చేశారు. కొందరి పై మ్యాన్ హ్యాండిలింగ్ చేశారు. నన్ను మినహా నా భార్య, కుమారుడు, తమ్ముడు అందరినీ అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తీసుకెళ్లమన్నారు. ఇదేనా ప్రజా స్వామ్యం. ఇంత నీచానికి దిగజారుతారా. 75 ఏళ్ల నా తల్లిని కూడా హింసించారు. ఇంత దుర్మార్గం ఎక్కడ చూడలేదు. న్యాయం గెలుస్తుంది. నా కుటుంబ సభ్యులను చిత్రహింసలు పెట్టి సంతకాలు చేయించుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు గమనించాలి. నా వెంట ప్రజలు ఉన్నారు. ఐటీ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాం.' అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



# నామినేషన్ పత్రాలు అందజేసిన సీఎం కేసీఆర్

(నేటి ఫోకస్ న్యూస్-సిద్దిపేట,నవంబర్9)

గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడో సారి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తన నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎర్రవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గజ్వేల్‌కు వెళ్లారు కేసీఆర్. నామినేషన్ దాఖలు అనంతరం గజ్వేల్ నుంచి హెలికాప్టర్‌లో కామారెడ్డికి కేసీఆర్ బయల్దేరారు కేసీఆర్. అక్కడ మధ్యాహ్నం 2 గంటల లోపు కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం అక్కడ నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించనున్నారు. కేసీఆర్ ప్రసంగంపై జనాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో సీఎం కేసీఆర్ శనివారం ప్రత్యేక పూజలు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ వేసే ముందు ప్రతిసారి సీఎం కేసీఆర్ కోనాయిపల్లి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి మొక్కి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నామినేషన్ పత్రాలను స్వామి వారి సన్నిధిలో పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పూజలు నిర్వహించి నామినేషన్ పత్రాలను అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి శాసనసభకు వేసే(రెండు సెట్లు) నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు.విజయాల పరంపర కోనాయిపల్లి వెంకన్నకు పూజలు చేసిన ప్రతిసారి సీఎం కేసీఆర్ కేసీఆర్‌కు విజయం వరించింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లోనూ విజయం సాధించారు. మరో విశేషం ఏమిటంటే, 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఆపై ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీని సీఎం కేసీఆర్ ప్రకటించారు.



## మల్లారెడ్డికి కారు లేదు.. విక్రమార్కకు అప్పులు లేవు

(నేటి ఫోకస్ న్యూస్- హైదరాబాద్, నవంబర్ 9)



అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ పక్రియలో భాగంగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో అఫిడవిట్లు సమర్పించారు. బీఆర్ఎస్ ప్రస్తుత ఎమ్మె ల్యేలు, మంత్రులు, కాంగ్రెస్ ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ సీనియర్ నాయకులు తమ ఆస్తులు, కేసుల వివరాలను వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి గా పోటీచేస్తున్న కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తనకు రూ.95 కోట్లకుపైగా ఆస్తులున్నట్టు పేర్కొన్నప్పటికీ.. చేతిలో ఒక్క రూపాయి నగదు లేదని, తనకు కారు కూడా లేదని అఫిడవిట్లో పొందుపరిచారు. మంత్రి గంగుల కమలాకర్ పలు సంస్థల్లో వ్యాపార భాగస్వామ్యం ఉన్నట్లు పొందుపరిచారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం నుంచి నామి నేషన్ దాఖలు చేశారు. మొత్తం 6 కేసులు, రూ.18.77 కోట్ల ఆస్తులు, రూ.5.99కోట్ల అప్పులు ఉన్నా యని పేర్కొన్నారు. మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టివిక్రమార్క తన అఫిడవిట్‌లో రూ.8.12 కోట్ల ఆస్తు లున్నాయని, అప్పులేవీ లేవని తెలిపారు. నాగర్‌కర్నూలు భారాస అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి రూ.112.23 కోట్లు ఆస్తులున్నాయి. కోరుట్ల నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి అర్వింద్ తనపై 17 కేసులతో పాటు రూ.107.43 కోట్ల ఆస్తులున్నాయని వెల్లడించారు.

## నామినేషన్ దాఖలు చేసిన మంత్రి హరీశ్ రావు



◆ సిద్దిపేట వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి హరీశ్ రావు ప్రత్యేక పూజలు

(నేటి ఫోకస్ న్యూస్-సిద్దిపేట,నవంబర్9)

మంత్రి హరీశ్ రావు సిద్దిపేటలో నామినేషన్ దాఖలు చేశారు. సిద్దిపేటలోని ఆర్వో కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు సిద్దిపేట వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి హరీశ్ రావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం పట్టణంలో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆర్వో కార్యాలయానికి బయల్దేరారు. కాగా, మంత్రి హరీశ్ రావు 2004 నుంచి సిద్దిపేటకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆ ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో 24,827 మెజార్టీతో విజయం సాధించారు. 2008 ఉప ఎన్నికల్లో 58,935 మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో తన మెజారిటీని పెంచుకుంటూ వెళుతున్నారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన పదవికి రాజీనామా చేసిన ఆయన.. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఆధిక్యంతో విజయం సాధించారు. ఇత తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో 93,328 ఓట్ల మెజారిటీ, 2018 ఎన్నికల్లో 1,18,699 మెజార్టీతో విజయం సాధించి ప్రత్యర్థి పార్టీలకు కనీసం డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు.


## నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్ రెడ్డి



(నేటి ఫోకస్ న్యూస్-వనపర్తి,నవంబర్9)

వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. వనపర్తిలోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా వెళ్లిన మంత్రి నిరంజన్ రెడ్డి వనపర్తి ఆర్వో కార్యాల యంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతకుముందు తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్వో కార్యాలయానికి ఎడ్లబండిపై బయల్దేరారు. ఈ సందర్భంగా వనపర్తి పట్ట ణంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. జనసందోహం నడుమ ఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నిరంజన్ రెడ్డి.. 1999-2000 ఏపీ ఖాదీ బోర్డు చైర్మన్ పనిచేశారు. 2001 నుంచి 2014 వరకు బీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా, మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2014లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2018 డిసెంబర్‌లో వనపర్తి అసెంబ్లీ నుంచి చిన్నారెడ్డిపై 51,685 ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా రు. ఫిబ్రవరి 2019లో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మార్కెటింగ్, కో-ఆపరేషన్, ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రిగా కొనసాగుతున్నారు.

## నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన కేటీఆర్



(నేటి ఫోకస్ న్యూస్- రాజన్న సిరిసిల్ల,నవంబర్9)

సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ ఐదోసారి బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు కంటే ముందు కేటీఆర్ ప్రగతి భవన్‌లో ప్రత్యేక పూజలు చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్ రాజకీయ జీవితం2006 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెన్నంటి నడిచారు. మొదటిసారి 2009 అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేశారు. సమీప ప్రత్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 171 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి 2010 ఉప ఎన్నికల్లో బరిలో నిలిచారు. సమీప ప్రత్యర్థి కేకే మహేందర్ రెడ్డిపై 68,219 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 జనరల్ ఎన్నికల్లో 53,004 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తిరిగి 2018 ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 89,009 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచి రికార్డు సృష్టించారు.

## బీఆర్ఎస్‌లోకి చేరిన సంభాని చంద్రశేఖర్..



(నేటి ఫోకస్ న్యూస్-హైదరాబాద్,నవంబర్9)

బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో వెల్లువలా చేరుతున్నారు. తాజాగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంభాని చంద్రశేఖర్ ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సమ క్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సంద ర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తన 50 ఏళ్ల కాంగ్రెస్ జీవితానికి కాంగ్రెస్ పార్టీలో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు, తాను ఖమ్మం జిల్లాతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గెలుపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

(నేటి ఫోకస్ న్యూస్-చెన్నూరు,నవంబర్9)

అసెంబ్లీలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మంచిర్యాల జిల్లా చెన్నూరులో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ కార్య కర్తలు, నాయకులతో కలిసి చెన్నూరు పట్టణంలోని ఆర్వో కార్యాల యానికి వెళ్లిన సుమన్.. నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే బాల్క సుమన్ తరపున రెండో సెట్ నామినేషన్‌ను మాజీ మంత్రి బోడ జనార్దన్ చెన్నూరు పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో దాఖలు చేశారు. ఆయనవెంట చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ భైస ప్రభాకర్, సీనియర్ నాయకులు రిక్కుల మధుకర్, రామ్ లాల్ ఉన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు చెన్నూరు పట్టణంలోని శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందడం జరిగింది.






## కొల్లాపూర్‌లో నామినేషన్ వేసిన బర్రెలక్క

(నేటి ఫోకస్ న్యూస్-కొల్లాపూర్, నవంబర్ 9)

తనపై కేసు పెట్టడంతో నిరసనగా నిరుద్యోగుల తరఫున కొల్లా పూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటున్నట్లు కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన శిరీష బుధవారం కొల్లాపూర్‌లో రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్‌కు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు... రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలి పేలా బర్రెలను కాస్తూ వీడియో తీసి యూట్యూబ్, సోషల్‌మీడియాలో పోస్టు చేసినందుకు తనపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. వారి తీరుపై నిరసనగా నిరుద్యోగుల వాణి వినిపించడానికే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## పవన్ మద్దతు కోరిన లండన్ మేయర్ అభ్యర్థి

(నేటి ఫోకస్ న్యూస్-హైదరాబాద్, నవంబర్ 9)

లండన్ మేయర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న భారత సంతతికి చెందిన తరుణ్ గులాటీ హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలిసి మద్దతు కోరారు. స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్న ప్రాంతంలో పవన్ కల్యాణ్ అభిమానులు, జన సైనికులు ఎక్కువగా ఉన్నారని గులాటీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ అభ్యర్థనను పవన్‌క ల్యాణ్ స్వాగతించినట్లు, ఆయనను అభినందించినట్లు జనసేన ఒక ప్రకటనలో వెల్లడించింది. తన అభిమానులు, జనసేన శ్రేణులు, తెలుగువారు, భారతీయులు తరుణ్ గులాటీ విజయానికి కృషి చేయాలని పవన్ కల్యాణ్ కోరినట్లు ఈ ప్రకటనలో పేర్కొంది.

## విమానంలో ఏపీ మహిళకు లైంగిక వేధింపులు

(నేటి ఫోకస్ న్యూస్-హైదరాబాద్, నవంబర్ 9)

ఓ అంతర్జాతీయ విమానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల మహిళపై ఆమె పక్కన కూర్చొన్న తోటి ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపు లకు పాల్పడ్డాడు. ఈ నెల 6న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్డ్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన లుఫ్తాన్సా విమానంలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు.. ఐపీసీ సెక్షన్ 354ఏ కింద కింద కేసు నమోదు చేశారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

(నేటి ఫోకస్ న్యూస్-నిర్మల్,నవంబర్9)

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ దాఖలు కంటే ముందు మంత్రి తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. నిర్మల్ పట్టణం ఎటు చూసినా గులాబీమయంగా మారింది. అడుగడుగునా ప్రజలు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## కత్తులు, తుపాకులు లేకుండా రేవంత్ రెడ్డి హత్య చేయగలరు


(నేటి ఫోకస్ న్యూస్-ఆదిలాబాద్,నవంబర్9)

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజకీయ వ్యభిచారిగా వ్యవహరిస్తున్నారని టికెట్లు అమ్ముకుంటూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే డబ్బులు దోచుకుంటున్నారని కాంగ్రెస్‌కు ఇటీవలే రాజీనామా చేసిన జిల్లా నాయకులు సాజిద్ ఖాన్, సుజాత, సంజీవరెడ్డి మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. తుపాకీ, కత్తులు లేకుండా హత్యలు చేసే వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిదర్శనం బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్ టికెట్ మార్పే నిదర్శ నమన్నారు.నియోజకవర్గంలో 11 రోజులపాటు ప్రచారం చేసి డబ్బులు ఖర్చు చేసిన వ్యక్తికి బీ ఫాం ఇవ్వలేదు. ఆదిలాబాద్ పర్యటనలో రేవంత్ రెడ్డి అన్ని అబద్ధాలు మాట్లాడారు. కంది శ్రీనివాస్ రెడ్డిని గెలిపిస్తానని రామచంద్రారెడ్డి ఏనాడు చెప్పలేదన్నారు. ఈ వ్యాఖ్యలపై మేము సవాల్ చేస్తున్నాం. పెద్దమ్మ గుడి వద్ద రేవంత్ రెడ్డి ప్రమాణం చేయాలన్నారు. రేవంత్ సభలో మాజీ మంత్రి స్వర్గీయ రామచంద్ర రెడ్డి ఫొటోకు నివాళులర్పించలేదు. ఆయన గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. రేపు ఇండిపెండెంట్ అభ్యర్థిగా సంజీవరెడ్డి నామినేషన్ వేస్తున్నారని స్పష్టం చేశారు.




# 'సలార్' ట్రైలర్ కోసం అభిమానుల ఆత్రుత

**ప్రభాస్ హీరోగా** నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సలార్' కోసం అభిమానులతోపాటు ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 28న విడుదల కావల్సిన ఈ చిత్రం పలు కారణాల చేత వాయిదా పడింది. డిసెంబర్ 22న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం ట్రైలర్‌ని డిసెంబర్ ఒకటో తేదిన విడుదల చేయనున్నట్లు సమాచారం. 'సలార్' ట్రైలర్ విడుదల విషయంలో ఎలాంటి వాయిదా లేదు. అలాగే సినిమా డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్ కోసం అందరూ సిద్ధంకండి అంటూ సమాచారం వస్తోంది. అయితే ఈ విషయంపై నిర్మాణ సంస్థ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ ఎంతో ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్న అభిమానులు సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ప్రశాంత నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ కథానాయిక. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. మొదటి భాగం సలార్ సీజ్‌ఫైర్‌ను ఈ ఏడాది క్రిస్మస్ పండుగ సందర్భంగా విడుదల చేస్తున్నారు. ఇక మరో విషయమేమంటే.. ఈ చిత్రంలో యంగ్ పంజాబీ బ్యూటీ సిమ్రత్ కౌర్ స్పెషల్ సాంగ్‌లో మెరువబోతుందన్న అప్‌డేట్ ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. బంగార్రాజులో కామియో రోల్‌లో మెరిసిన సిమ్రత్ కౌర్.. దర్టీ హరిలో కూడా నటించింది. ఈ ముద్దుగుమ్మ ప్రభాస్‌తో స్పెషల్ సాంగ్ చేస్తుందన్న వార్త ఇప్పుడు నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అఫీషియల్ అప్‌డేట్ రావాల్సి ఉండగా.. తాజా వార్తతో అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై ప్రభాస్, సిమ్రత్ కౌర్ కాంబోను ఊహించేసుకుంటూ తెగ ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు ఫ్యాన్స్. కొరియోగ్రఫర్ రాజు సుందరం పర్యవేక్షణలో ఈ సాంగ్ ఉండనుంది. వెకేషన్ తర్వాత ఇటలీ నుంచి హైదరాబాద్ తిరిగొచ్చాడు ప్రభాస్. అయితే ఇంకా సాంగ్ షూట్‌లో జాయిన్ కావాల్సి ఉంది. కొరియోగ్రఫర్ రాజు సుందరం పర్యవేక్షణలో ఈ సాంగ్ ఉండనుంది. వెకేషన్ తర్వాత ఇటలీ నుంచి హైదరాబాద్ తిరిగొచ్చాడు ప్రభాస్. అయితే ఇంకా సాంగ్ షూట్‌లో జాయిన్ కావాల్సి ఉంది.మరోవైపు సలార్ స్పెషల్ సాంగ్.. ప్రభాస్ హీరోగా నటిస్తున్న పాన్‌ఇండియా చిత్రం 'సలార్'.. సినిమా షూటింగ్ కూడా రామోజీ ఫిల్మ్‌సిటీలోనే జరుగుతోంది. సిమ్రత్‌కౌర్ తదితరులపై ఓ ప్రత్యేక గీతాన్ని రూపొందిస్తున్నారు. రాజు సుందరం నృత్య దర్శకత్వం వహిస్తున్న ఈ పాట అదిరిపోయేలా ఉంటుందని చిత్ర వర్గాల నుంచి సమాచారం.






# చెప్పు వదిలేసినా

**ఐకాన్ స్టార్ అల్లు అర్జున్** కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందించిన సినిమా 'పుష్ప' మూవీలో శ్రీవల్లి పాట ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాలోని శ్రీవల్లీ సాంగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచం మొత్తాన్ని ఒక ఊపు ఊపేసింది ఈ సాంగ్. అయితే తాజాగా శ్రీవల్లీ పాటపై బిగ్ బీ అమితాబ్ బచ్చన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 14 ఏండ్లుగా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రోగ్రామ్‌కు అమితాబ్ హోస్ట్‌గా వ్యవహరిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ షో 15 సీజన్ రీసెంట్‌గా ప్రసారమవుతోంది. తాజాగా జరిగిన ఓ ఎపిసోడ్ లో పుష్ప సినిమాపై ప్రశ్న రాగా.. ఆ ప్రశ్నకు అమితాబ్ సమాధానం ఇస్తూ.. అల్లు అర్జున్ నటించిన పుష్ప నిజంగా ఓ అద్భుతం, ఆ సినిమాలోని శ్రీవల్లీ పాట ఇండియా వైడ్ సూపర్ హిట్ అయ్యింది. ఇక ఆ సాంగ్‌లో అల్లు అర్జున్ చెప్పును వదిలేసే స్టెప్ ఒకటి ఉంటుంది. కేవలం చెప్పును వదిలేస్తే ఈ రేంజ్‌లో వైరల్ అవడం నేను మొదటి సారి చూశాను. ఆ పాట వచ్చాక చాలా మంది అదే స్టెపును వేశారు. అంటూ అమితాబ్ కేబీసీ షోలో తెలిపారు. ప్రస్తుతం అమితాబ్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కేవలం చెప్పు వదిలేస్తే ఈ రేంజ్ లో వైరల్ అవడం అనేది నేను మొదటి సారి చూస్తున్నా.. అంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు అమితాబ్. ప్రస్తుతం అమితాబ్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అల్లు అర్జున్ పై అమితాబ్ చేసిన ఈ కామెంట్స్ కు ఆయన ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.







### అల్లు స్థాయికి తగ్గరీతిలో

# పుష్ప-2

- అవార్డుతో ప్రత్యేక శ్రద్ధ పెట్టిన డైరెక్టర్

సూపర్‌సక్సెస్ చిత్రం పుష్ప'కు కొనసాగింపుగా పుష్ప-2 చిత్రం తెరకెక్కుతున్నది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం సాధించిన విజయంతో దానికి రెట్టింపు 'పుష్ప-2' ఉండేలా దర్శకుడు సుకుమార్ శ్రద్ధ తీసుకుంటున్నారు. అంతే కాదు.. ఈ చిత్రంతో హీరో అల్లు అర్జున్ కి ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డ్ రావడం, తెలుగు చిత్ర పరిశ్రమకు ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం ఇదే తొలిసారి కావడంతో బాధ్యత, ఒత్తిడి సుకుమార్‌పై మరింత పెరిగింది. దీంతో రెట్టింపు కష్టపడుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీ లో జరుగుతోంది. ఏ సినిమాకైనా పాట, ఫైట్ అంటే భారీతనం ఉండాల్సిందే! ఇక జాతర నేపథ్యంలో సాగే పాటంటే జాతరలో ఉన్నంత సందడి కనిపించాల్సిందే!



## గిల్‌తో డేటింగా..

# అబ్బే నేను కాదు..

## సారా అలీఖాన్ చిలిపి సమాధానం

**ప్రముఖ బాలీవుడ్ నిర్మాత,** దర్శకుడు, నటుడు కరణ్ జోహార్ తన షో 'కాఫీ విత్ కరణ్' ఇంకో సీజన్ మొదలెట్టారు. ఇది డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ప్రసారం అవుతోంది. ఈవారం అతని షోలో సారా అలీఖాన్ , అనన్యా పాండే సందడి చేశారు. అయితే ఈ షో ప్రోమో ఒకటి విడుదల చేశారు. అందులో కరణ్ జోహార్ కొన్ని ప్రశ్నలు సరదాగా అడిగాడు, దానికి సమాధానం కూడా వాళ్లిద్దరూ అంతే సరదాగా, చలాకీగా చెప్పుకొచ్చారు. సారా, నువ్వు ప్రముఖ క్రికెటర్ శుభ్ మన్ గిల్ తో డేటింగ్ లో ఉన్నావా, వార్తలు వస్తున్నాయి అని కరణ్ జోహార్ సారా అలీఖాన్ ని అడిగినప్పుడు ఆమె నవ్వుతూ, నేను ఆ సారా ని కాదు అని చెప్పింది. 'ప్రపంచం మొత్తం రాంగ్ సారా వెనకాల పడుతోంది, మీరందరూ చాలా తప్పుగా అర్థం చేసుకుంటున్నారు,' అని చెప్పింది సారా అలీ ఖాన్. ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ గిల్ డేటింగ్ చేస్తున్న విషయం వార్తల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. అందుకే ఈ ప్రశ్న కరణ్ కావాలనే సారా అలీ ఖాన్ ని అడిగినట్టుగా తెలుస్తోంది. దానికి సమాధానం కూడా అంతే సరదాగా సారా అలీఖాన్ చెప్పింది. అలాగే ఇంకొక నటీమణి అనన్యా పాండే కూడా ఈ షోలో సారా అలీఖాన్ తో వచ్చింది. ఆమె ఆదిత్య రాయ్ కపూర్ ని డేటింగ్ చేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. దాని మీద కరణ్ పరోక్షంగా అడిగితే, ఆమె కూడా అదే పద్ధతిలో ఆదిత్య రాయ్ కపూర్ గురించి చెప్పకనే చెప్పింది. ఇలా ఈ ఇద్దరూ ఆ షోలో సందడి చేస్తూ, అల్లరి కూడా చేశారు. ఇంకా వారిద్దరి గురించి చాలా విషయాలు కరణ్ అడిగితే, వాళ్లిద్దరూ తమదైన రీతిలో సమాధానాలు చెప్పారు.